శనివారం, 1 ఏప్రిల్ 2006

ఆంధ్రభూమి

# ఏడు నెలల పాపకు శుక్లాల ఆపరేషన్

రాజమండ్రి, మార్చి 31: రాజమండ్రిలోని గౌతమీనేత్రాలయ ఆసుపత్రిలో 7 నెలల బాలాశ్రీ అనే పాపకు కంటి శుక్లాల ఆపరేషన్ జరిగింది. ఖమ్మం జిల్లా పాపటుపల్లికి చెందిన బాలాశ్రీకి శుక్లాల కారణంగా రెండుకళ్లు కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు నేత్రాలయ వైద్యులను సంప్రదించారు. మత్తుమందు వైద్యుడు జిఎంబి ప్రసాద్ సహాయంతో నేత్రవైద్య నిపుణురాలు మాధురి బాలాశ్రీకి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఈవిషయాన్ని వెల్లడించారు. గత ఫిబ్రవరిలో రెండున్నర సంవత్సరాల పసిపాపకు కూడా ఇదే విధంగా ఆపరేషన్ నిర్వహించినట్లు చెప్పారు. రాజమండ్రిలోని అంధ పాఠశాలలో చదువుతున్న 28మంది విద్యార్థుల్లో 11మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చూపు తెప్పించవచ్చని నిర్ధారించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు తమ ఆసుపత్రిలో 28మంది పిల్లలకు గ్లకోమా ఆపరేషన్లు నిర్వహించామన్నారు. లొల్ల సౌజన్య, లొల్ల సంజీవ్‌కుమార్‌లకు గ్లకోమా ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు నేత్రచికిత్సలు చేసినా వారు తరుచూ వైద్యపరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. నేత్ర



బాలాశ్రీ

సంబంధమైన వ్యాధులు, నేత్ర పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నామని మధు వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతీ నిమిషానికి ఒక చిన్నారి కంటిచూపును కోల్పోతున్నారన్నారు. 60శాతం మంది చిన్నారులు పుట్టుకతోనే కంటిచూపును కోల్పోయి, మూడు సంవత్సరాల్లో మరణిస్తున్నారన్నారు. ప్రతీ వెయ్యి మందిలో ఒకరికి కంటిచూపులో దోషం ఏర్పడుతోందన్నారు. విటమిన్ డి లోపం వల్ల 16శాతం, కాటరాక్టు వల్ల 10శాతం, రెటీనా సంబంధ వ్యాధుల వల్ల 15శాతం, వారసత్వంగా వచ్చే జబ్బుల వల్ల 20-30శాతం, కంటిదోషాల వల్ల 37శాతం మంది తమ కంటిచూపును కోల్పోతున్నారని చెప్పారు. జిల్లాలో 2వేల 880 మంది కంటిచూపు లేని వారున్నారన్నారు. దృష్టి దోషం ఉన్నవారు 8వేల 640మంది ఉన్నారని తెలిపారు. వీరిలో 1728 మందికి తిరిగి చికిత్స చేసి కంటిచూపును తెప్పించవచ్చన్నారు. రాజమండ్రిలో 240మంది అంధులు ఉన్నారన్నారు. తమ సంస్థ పిల్లల్లో నేత్రసంబంధ వ్యాధులను గుర్తించేందుకు కృషిచేస్తోందన్నారు. పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి దృష్టిలోపాలు ఉన్న వారిని గుర్తిస్తున్నామన్నారు. ఈసమావేశంలో డాక్టర్ మాధురి, జిఎంబి ప్రసాద్ పాల్గొన్నారు.